


జనాన్ని బెదిరించి తరలిస్తే ఊరుకోం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి – జామి

సామాజిక సాధికార బస్సు యాత్రకు జనాన్ని తరలించడానికి దిగజారుడు చర్యలకు దిగడం వైసిపికి అంత మంచిది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు జామి మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రలు, బహిరంగ సభలకు రావాలని డ్వాక్రా మహిళలను బెదిరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వైసిపి సిబ్బందిని, వాలంటీర్లను పావులుగా వాడుకుని సభలకు రాని వారికి సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. సంక్షేమ పథకాలు వైసిపి నాయకులు సొంతడబ్బు కాదని, అది ప్రజాధనం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ప్రజలు స్వచ్ఛందంగా అధికార, ప్రతిపక్ష పార్టీల సభలకు వచ్చేలా పని చేయాలి తప్ప ప్రజల్ని భయపెట్టి రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైసిపి తీరును ప్రజలంతా గమనిస్తున్నారని, ఇదే పంథా కొనసాగితే, సిపిఎం ప్రజల్ని చైతన్య పరిచి ఉద్యమించడం ఖాయమని హెచ్చరించారు.

ఎండుతున్న వరిచేలు
రైతు కంట కన్నీళ్లు

కరువు మండలంగా ప్రకటించాలని రైతుల డిమాండ్

గత ఐదేళ్లలో ఒక్కసారి తప్ప వరుసగా కరువును ఎదుర్కొంటున్న రైతులను ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వెంటాడుతోంది. ఈ ఏడాది కూడా కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఆరుగాలం రాత్రనకా పగలనకా, కష్టించే రైతులకు చివరికి అప్పులే మిగులుతున్నాయి. నెలరోజులుగా వరుణుడు మొహం చాటేయడంతో మండలంలో వరిచేలు ఎండిపోయాయి. వాటిని బతికించుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఎండిపోతున్న వరిపొలం

పంటంతా పోయినట్టే



ఇప్పటికే మా పొలమంతా ఎండిపోయింది. ఆఖరిలో వర్షం దెబ్బ తీసేసింది. నాకున్న నాలుగు ఎకరాల్లోను వరిసాగుకు రూ.80వేలు వరకు మదుపు పెట్టేసాను. రాత్రి పగలు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా తోడుకుంటున్నాం. వర్షం పడకపోతే కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- బొంజిల్లి సన్యాసి, రైతు, కోమటిపల్లి

ప్రజాశక్తి-దత్తిరాజేరు


దత్తిరాజేరు మండలంలో పంటలసాగు పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడిఉంది. కేవలం ఉన్న కొద్దిపాటి చెరువులపైనే ఆధారపడి రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 1190 ఎకరాల్లో వరి సాగైంది. వర్షాలు ఖరీఫ్ ప్రారంభంలో కాస్తా ఆలస్యమైనా తరువాత కురవడంతో 9200 ఎకరాల్లో వరి సాగైంది. అధికారికంగా ఇప్పటివరకు 2600 ఎకరాలు వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. కానీ 4వేల ఎకరాలుపైనే ఎండిపోయినట్లు రైతులు తెలిపిన వివరాలు బట్టి తెలుస్తోంది. వారం రోజుల్లో వర్షాలు పడకపోతే బోర్ల కింద ఉన్న వరి పంట తప్ప, మొత్తం వరి పంట నాశనం అయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో దాదాపుగా చెరువులన్నీ అడుగంటి పోతున్నాయి. కళ్లముందే ఎండిపోతున్న వరిచేలను చూసి రైతులు వాటిని రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు. చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీరును కిరోసిన్ మోటార్లతో రైతులు రాత్రింబవళ్లు తోడుకుంటున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో చెరువులు ఎండిపోయి మోటర్లతో నీరు తోడుకుని అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పటివరకు కోరపు కృష్ణాపురం, కోరపు కొత్తవలస, టి. బూర్జ వలస, వి కృష్ణాపురం, ఎస్.బూర్జి వలస, దత్తి, పోరలి, కోమటిపల్లి గ్రామాల్లో ఇప్పటికే 30 నుంచి 40 శాతం వరి చేలు ఎండిపోయాయి.

అధ్వానంగా సాగునీటి కాలువలు

ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తున్న ఏడొంపుల గెడ్డ నుంచి తాడెం దొరవలస, కోమటిపల్లి, వింజవాసి మీదుగా సాగునీటి కాలువ ఉంది. ఈ కాలువ ప్రస్తుతం పూడికపోయి ఉంది. ఈ కాలువను బాగు చేస్తే దత్తరాజేరు మండలంలో 8 గ్రామాలతో పాటు, మెంటాడ మండలంలో కుంటినవలస, రేగ గ్రామాలకు కూడా సమృద్ధిగా సాగునీరు అందే అవకాశం ఉంది. ఆ దిశగా స్థానిక అధికారులు గాని . ప్రజా ప్రతినిధులు కానీ చర్యలు చేపట్టడం లేదు.

మినీ రిజర్వాయర్ల ఊసెత్తని పాలకులు

మండలంలో దత్తి గ్రామం వద్ద సార్వగడ్డ సమీపంలో మినీ రిజర్వాయర్ నిర్మించాలని టిడిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ కె నాయుడు ఆధ్వర్యంలో మినీ రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదన చేశారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. తిమిటేరు వద్ద కాకుల గడ్డ సమీపంలో కూడా మినీ రిజర్వాయర్ నిర్మించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిపాదనలు చేశారు. అప్పటి ఆర్‌డిఒ కూడా అక్కడ స్థల పరిశీలన చేశారు. నేటికీ పనులు జరగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మెంటాడ మండలం పోరాం బోడిమెట్ట వద్ద అప్పటి మాజీ మంత్రి నేతృత్వంలో మినీ రిజర్వాయరుకు ప్రతిపాదన చేశారు. అక్కడ కూడా ఎలాంటి పనులు జరగలేదు. ఎన్ని ప్రభుత్వాలు మారిన సాగునీటి వనరులపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. రైతు కష్టాలు వీరికి కనిపించడం లేదు. ఇప్పటికైనా పాలకులు రైతే దేశానికి వెన్నుముకని ఊక దంపుడు ప్రసంగాలు మానుకొని రైతు సంక్షేమంపై దృష్టి సారించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



డీజిల్ ఇంజిన్లతో నీరు పెడుతున్న రైతులు

నిరుడూ నష్టపోయాం



నిరుడు ధాన్యం బాగా పండాయంటే ఈక్రాప్ సరిగా చేయకపోవడం వల్ల ప్రభుత్వం నిర్ణయించి ధరకు అమ్ముకోలేక తక్కువ రేటుకు దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ఈ క్రాప్ సరిగా చేసుకున్నా , సరియైన వర్షాలు లేక పంట ఎండిపోతుంది. ప్రభుత్వం రైతులందరికీ 50 శాతం రాయితీపై డీజిల్ ఇంజిన్లు ఇలాంటి సమయాల్లో ఉపయోగపడతాయి.

- మార్పిన తిరుపతిరావు, రైతు, వి.కృష్ణాపురం

కరువు గ్రామాలకు బీమా వర్తిస్తుంది



మండలంలో ఎండిపోతున్న పంట వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు నివేదిస్తున్నాం. ఒక గ్రామంలో పంట నష్టపోతే ఆ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఈ క్రాప్ ఉయిన ప్రతి రైతుకూ పంటల భీమా వర్తిస్తుంది. పంటలు పోయిన గ్రామాలకు ఇన్సూరెన్స్ అధికారులు కూడా వెళ్లి పరిశీలిస్తారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఎం.అనురాధ, మండల వ్యవసాయ అధికారి

నిశితంగా ఓటర్ల జాబితా పరిశీలన

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదుపై కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం కంటోన్మెంట్ ప్రాంతంలోని నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏడు పోలింగ్ కేంద్రాలు, రూరల్ మండలం దుప్పాడ ప్రాథమిక పాఠశాలలో నాలుగు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. సిబ్బంది నిర్దేశించిన వేళల్లో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. బిఎల్‌ఒలు తప్పనిసరిగా నిర్దేశిత వేళల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిర్లక్ష్యం వహించిన బిఎల్‌ఒలపై క్రమశిక్షణ చర్యలు

ప్రత్యేక సమ్మరీ రివిజను –2024కు సంబంధించిన విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు పత్రికల్లో ప్రతికూల కథనాలు రావడంతో దత్తిరాజేరు మండలం బలభద్ర రాజపురం, డెంకాడ మండలం జొన్నాడ బిఎల్‌ఒలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ఈ విషయమై వీరిపై ఒక నివేదిక అందించాలని ఆదేశించామని తెలిపారు.

27, 28న విజయవాడలో మహా పడావ్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.మంగశ్రీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే మహా పడావ్‌ను విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.మంగశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు అధ్యక్షతన ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని మండిపడ్డారు. నెలకు రూ.3 వేలు వేతనంతో మోడీ, జగన్మోహన్ రెడ్డి జీవించగలరా? అని ప్రశ్నించారు. ధరలు ఆకాశంలో ఉంటే మెనూ ఛార్జీలు, వేతనాలు పాతాళంలో ఉన్నాయన్నారు. అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికుల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కూడా లేదన్నారు. శానిటేషన్ శానిటేషన్ కార్మికులకు రూ.6 వేలు ఇచ్చి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయిస్తున్నారని, రెండు నెలలుగా జీతాలు కూడా చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మేమంటూ ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ కార్మికుల సమస్యలు ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.మంగశ్రీ

కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ఇఎస్‌ఐ, పిఎఫ్, చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర కార్యదర్శి బి.రమణ, రాంబాయి, అచ్చియమ్మ, స్వప్న, రమాదేవి, నారాయణమ్మ, బేగం, లక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే పూర్తి

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష కార్యక్రమంలో జిల్లాలోని 983 రెవెన్యూ గ్రామాల్లోనూ డ్రోన్ సర్వే పూర్తయిందని జెసి మయూర్ అశోక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి 529 ఒఆర్ఐ మ్యాపులు గ్రామాలకు చేరాయని, ఇందులో 107 గ్రామాలకు గ్రౌండ్ వాలిడేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. జిల్లాలో 83 గ్రామాల్లో నోటిఫికేషన్–13 పూర్తయిందని, 81 గ్రామాల్లో ఆర్ఒఆర్ తుదిప్రక్రియ ముగిసిందని వివరించారు. 44 రెవెన్యూ గ్రామాల్లో అన్ని ప్రక్రియలు పూర్తిచేసి 7,656 మంది భూయజమానులకు పూర్తి హక్కులతో కూడిన ప్రాపర్టీ కార్డులు అందించామని తెలిపారు. జిల్లాలో తొలిసారిగా జామి మండలం సిరికిపాలెంలో ప్రాపర్టీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.



డ్వాక్రా బజార్‌లో సామగ్రి కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు

డ్వాక్రా బజార్ మరో 3 రోజులే

ప్రజాశక్తి-విజయనగరంకోట

విశేష ప్రజాదరణ పొందుతున్న అఖిల భారత డ్వాక్రా బజార్ మరో మూడు రోజులు మాత్రమే ఉంటుంది. ఈ సరస్‌లో అమ్మకాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే విక్రయాలు రూ.3 కోట్లు దాటాయి. వివిధ రకాల అలంకార వస్తువులు, హస్తకళలు, వస్త్రాలు, దుస్తులు, తినుబండారాలతో ఈ ప్రదర్శన అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా ఉంది. 15 రాష్ట్రాలకు చెందిన మహిళా సంఘాలు సుమారు 45 స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశాయి. అంతేకాకుండా ఆహ్లాదాన్ని కలిగించేందుకు, మన సంస్కృతి, సంప్రదాయాలను అందరికీ చాటి చెప్పేందుకు ఇక్కడ ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8వ తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందని కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆసుపత్రి, ఇతర అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే పేదలు ఆకలితో తిరిగి వెళ్లకూడదన్న ఉద్దేశంతోనే నగరంలో ఆరు ఫుడ్ బ్యాంకుల ద్వారా ఉచితంగా భోజనం పెడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న నగరంలోని ఎన్‌సిఎస్ రోడ్డులో ఉన్న ఫుడ్ బ్యాంకు వద్ద రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం చేపట్టిన భోజన వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేదలకు స్వయంగా వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగరంలోని ఆరు ఫుడ్ బ్యాంకుల ద్వారా నిత్యం వందలాది మందికి ఉచితంగా భోజనం పెడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ గౌరీ సేవా సంఘం ప్రతినిధులు కనిశెట్టి సుధాకర్, అడారి నగేష్, ఓం శంకర్, కాండ్రేగుల శేఖర్, మొల్లేటి నాయుడు, అడారి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఆహారం వడ్డిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఉత్సవం.. నిరుత్సాహం

- నానా అవస్థలు పడ్డ ప్రజలు
- సాహితీ ప్రముఖులకు లేనిచోటు
- మీడియాకు దక్కని గౌరవం
- పోలీసుల అత్యుత్సాహం
- ప్రకటనలకే పరిమితమైన మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పండగలు, ఉత్సవాలు మానవ సంస్కృతిలో భాగం. ఇందులో కొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయానికి సంబంధించినవి. మరికొన్ని చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకునేవి. ఇంకొన్ని పూర్తిగా మత నమ్మకాలు, విశ్వాసాలకు సంబంధించినవి. వీటిలో రెండో కోవకు చెందినవే విజయనగరం ఉత్సవాలు. విజయనగరం జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్య పరిమళాలను గుర్తుచేసుకుంటూ చాలా ఏళ్లుగానే ఉత్సవాలను పాలకులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జరిగిన ఉత్సవాలు కొన్ని రంగాలకు చెందినవారికి, సాధారణ ప్రజానీకానికి, మీడియా ప్రతినిధులకు ఒకింత నిరుత్సాహాన్ని కలిగించాయి. అధికారులు, రాజకీయ నాయకులకు మాత్రం ఉత్సవాలు ఎంతో హామీని, ఆత్మీయతను అందించాయి.

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఉత్సవాలంటేనే అంతా కలిసికట్టుగా చేయడం. సామాన్యులను సైతం భాగస్వామ్యం చేయడం. అందుకనుగుణంగా అన్ని వర్గాలను కలుపుకొని విజయనగర ఉత్సవాలను, పైడితల్లమ్మ పండగను విజయవంతంగా నిర్వహిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ , డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి ప్రకటించారు. కానీ, చాలామంది ప్రముఖులను కలుపు కోలేదనే భావన వ్యక్తమౌతోంది. విజయనగరం కళలకు కాణాచి. కవులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులకు పుట్టినిల్లు. కానీ, ఆయా రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించడంలో వెనుకబాటు ఉంది. ఆయా రంగాల్లో ప్రముఖులను కూడా రప్పించలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మ్యూజికల్ నైట్‌కు విఐపి పాసులు వెయ్యి, వివిఐపి పాసులు 150 సిద్ధం చేసినా, అవన్నీ రాజకీయ నాయకుల అనుచరులకే వెళ్లినట్లు తెలిసింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినా, వాటన్నింటినీ కలగాపులగం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారిక, ప్రయివేటు కార్యక్రమాలకు తేడా లేకుండా పోయింది. ఎంతో ప్రతిష్టాత్మక సురభి నాటక ప్రదర్శన జరుగుతున్న సమయంలో పులివేషాల పోటీ, డప్పుల మోతలు నటులను, ప్రేక్షకులను ఇబ్బంది పెట్టాయి.

సిరిమానోత్సవంలో కవరేజ్ కోసం ఇచ్చిన మీడియా పాస్‌తో సైతం పాత్రికేయులను గుడి లోపలకు అనుమతించలేదు. ఈసారి ఆలయం వద్ద మీడియా ప్రతినిధులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రాజకీయ నాయకులు, వారి అనుచరులు, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు దర్జాగా విఐపి మార్గంలో వెళ్లి దర్శనం చేసుకోవడం కనిపించింది. పాసు చూపించినా బారికేడ్లను దాటి లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. పైగా 'ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ పోలీసులు సవాల్ చేయడం అందరినీ ఆశ్చర్య పరిచింది. ఇదే సమయంలో ఎప్పటిలాగే కొంత మంది పోలీసు అధికారులు తమ వారిని విఐపి గేటు గుండా, ఆలయం వెనుక గేటు గుండా అమ్మవారి దర్శనానికి పంపించారు. గతంలో విజయ నగరం ఉత్సవ నిర్వహణ కమిటీలో మీడియా వ్యక్తులకు చోటుండేది. సీనియర్ పాత్రికేయులు ఈ కమిటీలో ఉండి, సలహాలు, సూచనలు ఇచ్చేవారు. మీడియా కవరేజ్‌కు సంబంధించిన అంశాలపై చర్చించి, తగు ఏర్పాట్లు చేసుకొనేవారు. ఈసారి అది కూడా కరువైంది. వారి అభిప్రాయాలను సైతం తెలుసుకొనే ప్రయత్నం ఏ కోశానా చెయ్యలేదు.

ఉత్సవాలపై నిర్వహించిన మొట్ట మొదటి సమావేశంలో సైతం ఎక్కడా మీడియాకు చెందిన వ్యక్తుల అభిప్రాయాన్ని తీసుకోలేదు. చివరికి విజయోత్సవాల్లో సైతం మీడియాకు స్థానం లేకుండా పోయింది. వీటిని శనివారం రాత్రి జరుపుకున్నారు. తమకు తామే సన్మానాలు చేసుకొని, మెమొంటోలు పంచుకొని, తమ జబ్బలు తామే చరుచుకొని మురిసిపోయారు. రహస్యంగా విజయోత్సవ విందును ఆరగించిన మన జిల్లా యంత్రాంగం.. చివరికి ఆ విందు విశేషాలను ప్రజలకు తెలియజేయడానికి ఎప్పటిలాగే మీడియా గుర్తుకొచ్చింది. మరునాడు సమాచార శాఖ ద్వారా, పత్రికా ప్రకటన ఇప్పించి, తాము చేసిన ఘన కార్యాన్ని ప్రజలకు తెలియజేయాలనుకోవడం విశేషం.

సమిష్టి కృషితో ఉత్సవాలు విజయవంతం

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో బాధ్యతగా పనిచేయడం వల్లే ఈ ఏడాది విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం విజయవంతమయ్యాయని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. తాను ఎన్నో ఏళ్లుగా ఈ ఉత్సవాలను గమనిస్తున్నానని, ఈ ఏడాది వచ్చినంతగా ఉత్సవాలకు భక్తులు, ప్రజానీకం ఎన్నడూ హాజరు కాలేదని చెప్పారు. శనివారం రాత్రి నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో విజయనగర, పైడితల్లమ్మ పండగలో సేవలందించిన జిల్లా అధికారులు, జీవితకాల సభ్యులకు మంత్రి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ సరస్ పేరిట అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శన, సురభి నాటకాలు వంటి అదనపు ఆకర్షణలు ఈ ఏడాది తోడయ్యాయన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం ద్వారా విజయనగరంపై ఇతర ప్రాంతాల వారికి మంచి అభిప్రాయం ఏర్పడేలా కృషి చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు కలెక్టర్ జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌పి దీపిక, నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ జీవితకాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఆర్‌ఎంపి క్లినిక్‌పై దాడికి ఖండన

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కంచర్లవారిపల్లిలో ఆర్‌ఎంపి అజయ్ కుమార్ క్లినిక్‌పై కొంతమంది దుండగులు దాడి చేసి, ఫర్నీచర్‌ను కాల్చడంపై ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి ఖండించారు. ఆదివారం స్థానిక పిఎస్ఆర్ కాంప్లెక్సులోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలందిస్తున్న ఆర్‌ఎంపిలపై దాడులకు పాల్పడటం దారుణమన్నారు. క్లినిక్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉమాశంకర్ సాయి, ముక్కు రమణ, గుప్తా, అంజన్రాయ్, దివాకర్, భవాని, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో మెరిసిన 'కంటోన్మెంట్' విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ యోగా పోటీలలో నగరంలోని కంటోన్మెంట్ పాఠశాల విద్యార్థులు మెరిశారు. పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని రాణించారు. యోగాలో పి.చైతన్య , సయ్యద్ ఇమ్రాన్ ప్రతిభ కనబరిచి కాంస్యపతకాలు సాధించారు. వీరికి బుద్ధయోగ ఫౌండేషన్ ద్వారా యోగ టీచర్ ఆర్.జ్యోతి తర్ఫీదునిచ్చారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. కాంచన , పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్, పిఇటి ప్రమీల, ఉపాధ్యాయులు అభినందించారు.



యోగాలో సాధించిన పతకాలతో విద్యార్థులు

ఎస్ఇకి సత్కారం

విజయనగరం టౌన్ : విజయనగర ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ సమయంలో విద్యుత్తు అంతరాయం లేకుండా సేవలందించిన ఆ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావును ఎపి విద్యుత్తు ఉద్యోగుల సంఘం (1104) ఆధ్వర్యాన ఆదివారం సత్కరించింది. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వంగపండు లక్ష్మణ, కార్యదర్శి సురగాల లక్ష్మణ్, వివిధ బ్రాంచుల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి రమణ, దేవరకొండ శ్రీనివాస్, గుమ్మడి దేముడు, వై.మంగరాజు, గేదెల దేముడు, లండ శ్రీనివాస్, ఎన్.వెంకటేశ్వర్లు, సిహెచ్. సింహాచలం, బొడ్డు శారద, ఎ.జి.మల్లేశ్వరరావు, పి.వి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- గంట్యాడ

ఈ నెల 8న జరగనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ సోమేష్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును కారు చౌకగా సంపన్నుడైన అదానికి దోచి పెడుతున్నారన్నారు. దీని వల్ల అభివృద్ధి చెందుతున్న విశాఖ రాను రాను వెనుకబడిపోతుందని చెప్పారు. అక్కడ పని చేసిన కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని సొంత గనులను కేటాయించాలని, మరో పక్క రాష్ట్ర పునర్విభజన హామీలలో భాగంగా రాయలసీమ ప్రాంతంలో వలసలు తగ్గించడానికి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, గంగరాజు, కోటారావు, హర్ష వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి : గొంప

ప్రజాశక్తి - వేపాడ

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని బానాది గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు గుమ్మడి రవిశంకర్‌తో పాటు 15 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి గొంప కృష్ణ పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. రవిశంకర్ టిడిపి తీర్థం పుచ్చుకోవడంతో రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కోళ్ల లలిత కుమారి వర్గీయులు కూడా గొంప కృష్ణను కలిసి మద్దతు ప్రకటించారు ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు విసిగి చెంది టిడిపిలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు వితరణ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికపల్లి గ్రామంలో వినాయక్ నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహాయంతో ఆదివారం 40 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తుమ్మికపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, రైల్వే కాంట్రాక్టర్ సన్యాసిరావు, త్రినేత్ర డిఫెన్స్ కాన్సెప్ట్ స్కూల్ అధినేత గణేష్, వార్డు మెంబర్ వెంకట్, ఈశ్వర అప్పారావు మాస్టర్ పాల్గొని నిత్యావసరాలను పంపిణీ చేశారు. సర్పంచ్ విరోతి కొండలరావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ట్రస్ట్ సభ్యులు చేతుల మీదగా ఘనంగా సన్మానించారు. అనంతరం త్రినేత్ర అధినేత గణేష్ వృద్ధులకు 40 దుప్పట్లు, 40 మఫ్లర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ రంగుడు ప్రవీణ్ కుమార్, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్, గణేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఆవరణలో ఆశయ యూత్ అసోషియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, విద్యార్థి నేస్తం పుస్తకాలను పంపిణీ చేశారు. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన స్థానం చేరుకోవాలంటే విలువలతో కూడిన పుస్తకాలు చదవాలన్నారు. తద్వారా విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అబ్బుతోందన్నారు. ప్రతి విద్యార్థి సంకల్పంతో తమ అనుకున్న లక్ష్యం సాధించాలని ఈ పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడాలని ఉద్దేశంతో ఈ పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. ఈ పుస్తకం చదివిన తరువాత మరోక విద్యార్థి కి ఈ పుస్తకం ఇవ్వాలని ఇందులో విషయాలు అందరికీ తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం సాధ్యం

ప్రజాశక్తి - గజపతినగరం

గ్రామ స్వరాజ్యం సచివాలయాలతో సాధ్యమని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. మండలంలోని కాలంరాజుపేట, పురిటిపెంట, మధుపాడ గ్రామాలలో సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం, ఆదినారాయణ, పార్టీ నాయకులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, పల్లి సంజీవరావు, బూడి వెంకటరావు, గేదెల ఈశ్వరరావు, కె.పైడపు నాయుడు, సర్పంచులు, వైస్ సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

7న ద్విచక్ర వాహనం వేలం

నెల్లిమర్ల: స్థానిక ఎస్ఐబి పోలీసు స్టేషన్‌లో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు ఎస్ఐబి సిఐ జి.రాజశేఖర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నెల్లిమర్ల ఎస్ఐబి పోలీసు స్టేషన్‌కు వచ్చి బైక్‌ని పరిశీలించి వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

7న సవరవల్లిలో గడపగడపకు..

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి సచివాలయం పరిధిలో 7వ తేదీ నుంచి గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆదివారం తెలిపారు. రెండు రోజులపాటు ఈ సచివాలయం పరిధిలోని జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని ఆయన కోరారు.

చెక్‌పోస్టుతో అ'ధన'పు భారం

ప్రజాశక్తి - వేపాడ



ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెక్ పోస్టు ఇదే..

మండలంలో రామస్వామిపేట, సోంపురం, జాకేరు, ఎస్ఎస్ఆర్‌పురం, చిన్న దుంగాడ, వావిలపాడు, వీలుపర్తి, గ్రామాల వద్ద రాతి క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల ద్వారా వచ్చే రాయిని, జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలో ట్రాక్టర్ రాయిలోడును రూ. 1000లోపే అమ్మేవారు. లారీ లోడ్ కావాలంటే రూ. 3వేలు వరకూ ఉండేది. ఈ రాయిని తరలించే ప్రాంతంలో ప్రస్తుతం ప్రభుత్వం ప్రయివేటుగా ఒక కాంట్రాక్టర్‌కు చెక్ పోస్టు పెట్టుకునే అవకాశం కల్పించింది. దీంతో ప్రతి వాహనం దగ్గర ఈ చెక్ పోస్టు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో లారీ, ట్రాక్టర్ యజమానులు గృహ నిర్మాణ దారుల వద్ద అదనంగా లోడుకు రూ. 700 నుంచి రూ. 800 వరకూ వసూలు చేస్తున్నారు. ఈ చెక్ పోస్టు ఏర్పాటు చేయడం వల్ల అధనంగా లబ్ధిదారులకు భారం పడుతోందని చెక్‌పోస్టుతో కాంట్రాక్టర్‌కే మేలు జరుగుతోందని పలువురు వాపోతున్నారు. ప్రతి రాయి లోడుకు అధనంగా డబ్బులు వసూలు చేయడంతో చాలా మంది జగనన్న ఇంటి నిర్మాణాలకు ముందుకు రావడం లేదని అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎత్తివేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సుందర పేట గ్రామానికి చెందిన కోలా పైడిరాజు 18 బాటిల్స్ పట్టుకుని వెళ్తుండగా ముక్కాం వెళ్లే జంక్షన్ వద్ద ఎస్ఐ కృష్ణమూర్తి వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెంట శ్రీరాంపురం గ్రామానికి చెందిన బోడాల స్రవంతి (15) కనిపించడం లేదని ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలు ప్రకారం.. స్రవంతి పెంట శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. శనివారం సాయంత్రం పాఠశాల విడిచి పెట్టిన తర్వాత ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాలలోని, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం గంట్యాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121109427, 9121109442 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అన్నదాతల కష్టాలు తెలిసిన పాలకులేరీ?

●రైతుగర్జనలో జనసేన, టిడిపి నాయకుల ప్రశ్న ● కరువు జిల్లాగా ప్రకటించాలని నిరసన ర్యాలీ ●ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - వేపాడ

అన్నదాతల కష్టాలు తెలిసిన పాలకులు వైసిపిలో ఎక్కడున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, జనసేన నియోజకవర్గం నాయకులు ఒబ్బిన సత్యనారాయణ అన్నారు. జనసేన, టిడిపి సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో ఆదివారం రైతు గర్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా వర్షాభావం వల్ల నష్టపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పంట పొలాలకు సాగునీరు అందించలేని ఇటువంటి ప్రభుత్వాన్ని వెంటనే గద్దె దించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కరువు మండలంగా గుర్తించి నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన టిడిపి నాయకులు గొరపల్లి రాము, గొంప వెంకటరావు, గుమ్మడ భారతి, జనసేన నాయకులు గొరపల్లి రవి, సుంకరి అప్పారావు, కొట్టియాడా రామకోటి, షేక్ ఫిరోజ్, ఒబ్బిన సన్యాసినాయుడు,జనసేన, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఉమ్మడి విజయనగరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని టిడిపి, జనసేన సంయుక్త జిల్లా కో ఆర్డినేటర్ లోకం మాధవి డిమాండ్ చేశారు. ఆదివారం జనసేన ఆధ్వర్యంలో రైతు గర్జన కార్యక్రమంలో భాగంగా రైతులతో మాల్యాడ నుంచి ఒమ్మి మీదుగా సతివాడ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల్లో కరువు ఛాయలు అలుముకున్నాయని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరువు పై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. జిల్లాలో ఉన్న తోటపల్లి కాలువ నుంచి నీరు వదలడం మీద దృష్టి పెట్టి ఉంటే కొన్ని ప్రాంతాల్లోనైనా పంటలు ఎండిపోయేవి కాదన్నారు. కరువు వల్ల నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: నిరసన ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

తెర్లాం: మండలంలోని సోమదివలసలో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం రైతు గర్జన' కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో దాదాపు 100 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని బొబ్బిలి జనసేన నియోజకవర్గం ఇంచార్జి గిరాడ అప్పలస్వామి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహన కార్యదర్శి బాబు పాలూరు తెలిపారు. ఈ సందర్భంగా వరి పంటను జనసేన నాయకులతో కలిసి టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, మాజీ ఎంపిపి నర్సుపల్లి వెంకటేష్ పరిశీలించారు. బాబు పాలూరు పట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి ఎమ్మెల్యేకి కనీసం చిత్తశుద్ధి ఉంటే రైతులకు తక్షణమే న్యాయం చేయాలన్నారు. గిరాడ అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్ నియంతలా పాలిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మరడాన రవి, జనసేన నాయకులు చందక ఉమామహేష్, బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, రామభద్రపురం మండల అధ్యక్షులు భవిరెడ్డి మహేష్, జనసేన సీనియర్ నాయకులు లంకా రమేష్, అడబాలు నాగు, పళ్లెం రాజా, చీమల సతీష్, కనకల శ్యాం, మహంతి ధనుంజయ, రాజా జగన్, తెర్లం మండల నాయకులు బూరి రామకృష్ణ, రాజు, అబోతుల రాజు, పాండ్రంగి అప్పారావు, ఎందువా సత్యన్నారాయణ, వీర మహిళలు యామిని, రమ్య, వరలక్ష్మి, గోపి, సాయి, నవీన్, శ్రీను, సింబు, శివ, మండల శ్రీకాంత్, జన్నివలస నవీన్, రామ్ లక్ష్మణ్, రఘు, రమేష్, పెరుమాలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: వర్షాభావం వల్ల ఈ ఏడాది రైతులు ఆర్థికంగా నష్టపోయారని, తక్షణమే వారిని ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. రైతుగర్జన కార్యక్రమంలో భాగంగా కోరుకొండ గ్రామంలో ఎండిపోయిన వరిపంటను ఆదివారం జనసేన, టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తీవ్ర కరువు పరిస్థితుల్లో రైతాంగం ఉంటే... వారి సమస్యలపై కేబినెట్ సమావేశంలో కనీసం చర్చించకపోవడం జగన్ ప్రభుత్వానికి అన్నదాతల సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడంపై ఉన్న శ్రద్ధ కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంపై లేదన్నారు. కరువు మండలాలకు సంబంధించి కలెక్టర్లు.. రాష్ట్రంలో 470 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని నివేదిక ఇస్తే.. ప్రభుత్వం కేవలం 103 మండలాలు మొక్కుబడిగా ప్రకటించడం రైతుల్ని వంచించడం కాదా? అని ప్రశ్నించారు. జిల్లాలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఐవిపిరాజు, బొద్దల నర్సింగరావు, గంట పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌బాబు, జనసేన నాయకులు గురాన అయ్యలు, కాటం అశ్విని, ఎం.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: ఎండిన పంటను పరిశీలిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

దళితులపై దాడుల్లో జగనే ప్రథమ ముద్దాయి

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలో దళితులపై దాడులు ముఖ్యమంత్రికి పట్టవా? అని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవిభాస్కర్ మండిపడ్డారు. ఆదివారం నగరంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఈ నెల 3న కృష్ణా జిల్లా నందిగామలో దళిత యువకుడిని అక్కడ దళిత మంత్రి ఆదిమూలపు సురేష్ కుమారుడు, వారి అనుచరులు దాడి చేసి, నోటిలో మూత్రం పోయడం దారుణమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్ని దాడులకు పాల్పడినా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని సిఎం జగన్ ఏం చేస్తున్నారో ఎవరికీ అర్థం కావట్లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ పార్లమెంటరీ అధికార ప్రతినిధి డి.రాంబాబు, నగర అధ్యక్షులు కె.పైడిరాజు, నియోజకవర్గ అధ్యక్షులు గుండెల ప్రకాశ్, మాజీ కౌన్సిలర్ ఎం.పైడిరాజు, డి.బుజ్జి, బి.అప్పారావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: దళితులపై దాడులు, దారుణాల్లో ప్రథమ ముద్దాయి జగన్ రెడ్డేనని నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. ఆదివారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఆమె ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులను అన్ని రకాలుగా అణచివేస్తున్న జగన్ రెడ్డికి, మంత్రులకి యాత్ర చేసే హక్కు లేదన్నారు. దళితులే ధ్యేయంగా బలహీన వర్గాలే లక్ష్యంగా రెడ్డి సామాజిక వర్గం రాష్ట్రంలో పేట్రేగిపోతుందన్నారు పాలకులుగా తమ వారు ఉన్నారన్న ధైర్యంతోనే ఆ వర్గం తెగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భీసెట్టి అరుణ, నానిగిరి రమణాజీ, మళ్లేశ్వర రావు, మహిళలు పొలమరశెట్టి మహా లక్ష్మీ, బోనంగి జ్యోతి, ఛక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌కోట: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కోళ్ల

నెల్లిమర్ల: దళితుల పై జరుగుతున్న దాడుల పట్ల టిడిపి నాయకులు ఆదివారం నెల్లిమర్లలో నిరసన వ్యక్తం చేశారు. టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంధవరపు హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానిక రామ తీర్థం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన చేపట్టారు. నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగారాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితుల పై దాడుల మరింత పెరిగి పోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి దళితులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, నెల్లిమర్ల, పూసపాటి రేగ మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్, మహంతి శంకర్రావు, అధికార ప్రతినిధి గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, చీకటి సుహాసిని, కనిగిరి శ్రీనివాసరావు, పొడుగు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. అత్యంత వెనుకబడిన, వివక్షకు గురవుతున్న దళిత సోదరులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ముందుకు తీసుకు వెళ్లాల్సింది పోయి జగన్ పాలనలో వారి మీద అధిక స్థాయిలో దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపై దాడులను ఖండిస్తూ ఆదివారం చీపురుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో దళితుల మీద దాడులు పెరిగిపోయాయన్నారు. మాస్క్ అడిగినందుకు ఒక వైద్యుడిని చంపేశారని, మాస్క్ లేదని మరో యువకుడిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మగంటి సూరి నాయుడు, దళిత నాయకులు పెందుర్తి సింహాచలం, రేగిడి లక్ష్మణరావు, పైడిరామ్, శ్రీను, శివ, రామారావు, అప్పలరాజు టిడిపి నాయకులు పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, ముల్లు రమణ తదితరులు పాల్గొన్నారు.


తోపుడు బండ్లను అందజేస్తున్న గొంప కృష్ణ


తోపుడు బండ్లు పంపిణీ

శృంగవరపుకోట: టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తన సొంత నిధులు సుమారు రూ. 80వేలతో నాలుగు తోపుడు బండ్లను అందించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చిరు వ్యాపారులకు ఆదివారం ఈ బల్లను అందజేశారు. కోనాడ ఈశ్వర రావుకు (కూల్ డ్రింక్స్ బండి), మండా భవాని, పెంటకోట శ్రీనివాస్, మునగపాక పార్వతిలకు టిఫిన్ బండ్లను అందించారు. చిరు వ్యాపారానికి తోపుడు బండ్లను అందజేసి అండగా నిలిచిన గొంప కృష్ణకు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. గొంప కృష్ణ మాట్లాడుతూ సమాజంలో నిరుపేద, బడుగు బలహీన వర్గాల వారికి టిడిపి అండగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవి కుమార్, గొరపల్లి రాము, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, ఇప్పాక త్రివేణి, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాస్ రావు, మండా త్రినాథ, సిరికి రమణ, సేనాపతి గణేష్, ఇందుకూరి శ్రీనిరాజు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో మంచి ఫలితాలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చిందని ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్య నారాయణ రాజు అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం మొయిద విజయరాంపురంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా నెల రోజులు పాటు ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పేదల ఆరోగ్యం విషయంలో మంచి ఫలితాన్ని ఇచ్చాయన్నారు. ముఖ్యంగా పేద వారికి ఎంతో ఖరీదైన వైద్యంతో పాటు ఆరోగ్య పరమైన ఇబ్బందులు తెలుసుకొని ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పొందేలా సీఎం జగన్ మోహన్ రెడ్డి సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 41,161 మంది టెస్టులు చేయించుకోగా అందులో 5,734 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించామన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఏ ఒక్కడి ఆరోగ్యాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిడిపి హయాంలో కేవలం దోచుకోవడమే తప్ప వారి పరిపాలనలో పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసిన దాఖలాలే లేవని ఆరోపించారు. కానీ ఇప్పుడు సంక్షేమాన్ని ఇంటికి అందిస్తున్నామన్నారు. టిడిపి, జనసేన ఎంత బురద జల్లినా రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కడతారని జోష్యం పలికారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

బాధితులకు అండగా 'సాధన'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రైల్వే ప్రమాద బాధితులకు సాధన యువ జన సంఘం అండగా నిలిచిందని లోకసత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం జిజి హెచ్‌లో జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు. గత నెల 29న కంటకాపల్లి సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గ ప్రసాద్, రొంగలి దుర్గా ప్రసాద్, పసుమర్తి వెంకట రమణ ఆధ్వర్యంలో విజయనగరం జిజి హెచ్ రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ రైల్వే ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల కోసం మానవత్వంతో రక్తదాన శిబిరం ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన సాధన యువజన సంఘం ఆలోచన అమోఘమన్నారు. రైల్వే బాధితులకు అండగా ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నా ఊరు విజయనగరం ఎన్‌జిఒ అధ్యక్షులు గుమ్మడి విశాలాక్షి, అబ్దుల్ కలామ్ సేవా సమితి అధ్యక్షులు పైడిపు నాయుడు మాస్టర్, సంఘం సభ్యులు కనకల సురేంద్ర, మద్దిల మనోహర్, నల్లి వాసు, హరి సోమ నాయుడు, పట్నాయక్, గుడ్ల రాజ, సందీప్, దిలీేశ్, సురేష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది అప్పలనాయుడు, రమణ, శేఖర్,హరి పాల్గొన్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జి

పారదర్శకంగా ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఓటర్ల నమోదులో పారదర్శకత పాటించాలని ఆర్‌డిఒ సాయిశ్రీ కోరారు. ఓటర్ల నమోదు ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా ఆదివారం మండలంలోని మెట్టవలస, పిరిడి, పట్టణంలోని జెండావీధి, గొల్లపల్లి, గెస్ట్ హౌస్ కాలనీ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా యువతీ యువకులను చైతన్యం చేయాలని కోరారు. డబుల్ ఎంట్రీ, మరణించిన వారి ఓట్లను, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించాలని ఆదేశించారు. బిఎల్‌ఒలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు ఉన్నారు.


బిఎల్‌ఒకు పత్రాలను అందిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ సాయిశ్రీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఓటర్ లిస్టును సక్రమంగా చూసుకోవాలన్నారు.

'ఎపికి జగన్ ఎందుకు కావాలి'పై ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎపికి జగన్ ఎందుకు కావాలిపై విస్తృత ప్రచారం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్ల వివరించాలన్నారు. నవంబర్ 9వ తేది నుంచి నియోజకవర్గంలో ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించబోయే ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తిచేసుకుని ఆరేళ్లు కావస్తున్న సందర్భంగా సోమవారం ఉదయం నియోజకవర్గంలోని ఆయా మండల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనను ప్రజలకు వివరించాలన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రను బొబ్బిలి నియోజకవర్గంలో నిర్వహించేందుకు ముందస్తుగా ప్రణాలికను సిద్ధం చేసి బస్సుయాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బొబ్బిలి నియోజకవర్గ, మండల, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, జెసిఎస్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 15న జరగనున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరిను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు పని చేస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ప్రజలపై భారాలు వేసేందుకు చట్టాలను చేస్తున్నారని, కేంద్రం తీసుకొస్తున్న చట్టాలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలతో నిత్యావసర ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరగనున్న ప్రజా రక్షణ భేరిను జయప్రదం చేయాలని కోరారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు శంకరరావు

పార్టీ అభివృద్ధికి కృషి : పాలవలస

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని అన్నారు. ఆదివారం బుడతనాపల్లిలో బమ్మిడి ఎర్రి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన జనసేన కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని గెలుపై లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి చెందడానికి పార్టీ కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. జనసేన, టిడిపి పార్టీలు ఉమ్మడి పోరాటం చేసి వైసిపిని ఓడించాలన్నారు. పిఎసి సభ్యులు పడాల అరుణ మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో కరువును వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బస్సు యాత్రలో మునిగిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుర్రాన అయ్యలు, మర్రాపు సురేష్, ఆదాడ మోహన్‌రావు, బుడతనాపల్లి గ్రామానికి చెందిన నాయకులు రొంగలి అప్పలనాయుడు, చల్లా సత్యనారాయణ, గేదెల శ్రీను, తణుకు కుమార్, పల్లా రాము, నోడగల ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలవలస యశస్విని